సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
ఆదివారం । 23 । మార్చి । 2025



టెక్నిక్‌తో జీవితం సెట్

పాలిటెక్నిక్ విద్య ద్వారా విద్యార్థులకు మంచి భవిష్యత్తు లభించనుంది. వచ్చే నెల 30న జరిగే పాలిసెట్‌లో ప్రతిభ చూపడం ద్వారా వారు తమ భవితకు బంగారు బాట వేసుకోవచ్చు. -8లో



అనర్హులే పట్టు సాధించారు

అనర్హులకు ప్రోత్సాహకాలు ఇస్తున్నారంటూ మల్బరీ రైతులు ఆందోళనకు దిగారు. చేబ్రోలు పట్టు పరిశ్రమ అధికారులు సిఫార్సులకు ప్రాధాన్యమిచ్చి అర్హులను విస్మరించారని ఆరోపిస్తున్నారు. -8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ ఆదివారం (సాయంత్రం)	సహర్ సోమవారం (ఉదయం)
రాజమండ్రి	6.24	4.44
కాకినాడ	6.24	4.43
అమలాపురం	6.24	4.43

న్యూస్‌రీల్

శివారు భూములకు నీరందించాలి

అమలాపురం రూరల్: ఆయకట్టు చివరి భూముల వరకూ సాగునీరు అందేలా క్రాస్ బండ్‌లు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. సాగునీటి ఎద్దడిపై జలవనరులు, డ్రైనేజీ, వ్యవసాయ అధికారులతో కలెక్టరేట్‌లో శనివారం ఆయన సమీక్షించారు. క్షేత్ర స్థాయి ఏఈలు ఏఓలు సమన్వయంతో పని చేసి, నీటి ఎద్దడి సమస్యను అధిగమించాలన్నారు. సాగునీటి సరఫరాపై ఏప్రిల్ 15 వరకూ అప్రమత్తంగా ఉండాలని, పంటలను కాపాడుకునేలా రైతులకు తోడ్పడాలని సూచించారు. ఆర్‌డీఓలు మండలాల వారీగా నివేదిక రూపొందించి, సాగునీరు సమృద్ధిగా అందేలా ప్రతి వారం రెండుసార్లు పర్యవేక్షించాలని ఆదేశించారు. రాజోలు మండలంలో సుమారు 70 ఎకరాలు, అమలాపురం 96 ఎకరాలు, ఉప్పలగుప్తం 100 ఎకరాలు, అల్లవరం 80 ఎకరాలు, మామిడికుదురు 100 ఎకరాలు, అంబాజీపేట మండలం చివరి ఆయకట్టులో 100 ఎకరాల్లో సాగునీటి సమస్య నెలకొందని కలెక్టర్ మహేష్ కుమార్ వివరించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి, ఆర్‌డీఓలు దేవరకొండ అఖిల, కె.మాధవి, పి.శ్రీకర్ తదితరులు పాల్గొన్నారు.

డొంకరాయి నుంచి 5 వేల క్యూసెక్కులు

సీలేరు: గోదావరి డెల్టాలో రబీ సాగుకు సీలేరు కాంప్లెక్స్‌లోని డొంకరాయి జలాశయం నుంచి 5 వేల క్యూసెక్కుల నీటిని శనివారం నుంచి విడుదల చేస్తున్నట్లు ఏపీ జెన్‌కో అధికారులు తెలిపారు. గోదావరి డెల్టాకు సీలేరు జలాలు విడుదల చేయాలని ఇరిగేషన్ అధికారులు గత ఫిబ్రవరి 10న కోరారు. ఈ మేరకు డొంకరాయి నుంచి 5 వేలు, పొల్లూరు జలవిద్యుత్ కేంద్రం నుంచి 4,300 క్యూసెక్కుల చొప్పున విడుదల చేస్తున్నామని జెన్‌కో అధికారులు వివరించారు. ఫిబ్రవరి 10 నుంచి శనివారం వరకూ గోదావరి డెల్టాకు 10.19 టీఎంసీల నీటిని విడుదల చేశామన్నారు. ఈ నెల 31 వరకూ నీటిని విడుదల చేయనున్నామని తెలిపారు.

డీఆర్‌డీఏ పీడీగా జయచంద్ర



నూతన పీడీ జయచంద్రను అభినందిస్తున్న యూనియన్ నాయకులు

ముమ్మిడివరం: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) ప్రాజెక్టు డైరెక్టర్(పీడీ)గా టి.సాయినాథ్ జయచంద్ర శనివారం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడ డ్వామాలో పని చేస్తున్న ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకూ పీడీగా పని చేసిన శివ శంకర ప్రసాద్ రాష్ట్ర డైరెక్టర్‌గా పదోన్నతిపై వెళ్లారు. బాధ్యతలు స్వీకరించిన జయచంద్రకు సెర్ప్ ఉద్యోగులు, జిల్లా యూనియన్ నాయకులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు దేవ వరాలబాబు, కార్యదర్శి ముత్తాబత్తుల వెంకటేశ్వరరావు, కోశాధికారి భూపతివర్మ, మహిళా విభాగం నాయకురాలు పాటి వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ పేరు తొలగింపు దుర్మార్గం



మాజీ ఎంపీ చింతా అనురాధ

అల్లవరం: విశాఖపట్నంలోని క్రికెట్ స్టేడియానికి వైఎస్సార్ పేరును తొలగించడం దుర్మార్గమని మాజీ ఎంపీ చింతా అనురాధ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజాసేవతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే కాకుండా యావత్తు దేశంలోనే దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఎంతో కీర్తి పొందారని గుర్తు చేశారు. సంక్షేమ ప్రదాతగా, అపర భగీరథునిగా ప్రజల హృదయాల్లో చిరంజీవిగా స్థానం సంపాదించుకున్నారని అన్నారు. అధికారం చేతిలో ఉందనే అహంకారంతో వైఎస్సార్ పేరును ప్రభుత్వం కుట్రపూరితంగా తొలగించిందన్నారు. కడప జిల్లాకు ఎంతో గుర్తింపు తెచ్చిన మహానేత వైఎస్సార్ అని కొనియాడారు. టీడీపీ వ్యవస్థాపకుడు, దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌కు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో గుర్తింపునిచ్చి, ఒక జిల్లాకు ఆయన పేరు పెట్టారని గుర్తు చేశారు. వైఎస్సార్, ఎన్టీఆర్‌లకు సముచిత స్థానం కల్పించిన నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని పేర్కొన్నారు. ఎన్టీఆర్ జిల్లా పేరు మార్చే దమ్ము చంద్రబాబుకుందా అని ప్రశ్నించారు. పేర్లు మార్చుతూ ఇచ్చిన ఉత్తర్వులను వెంటనే వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, కూటమి ప్రభుత్వానికి వారు బుద్ధి చెప్పే రోజు త్వరలోనే వస్తుందని అనురాధ పేర్కొన్నారు.

అక్కడ సరే... మరిక్కడ..!

- ఉమ్మడి జిల్లాలో తీరం పొడవునా అక్రమ ఆక్వా సాగు
- సీఆర్‌జెడ్ నిబంధనలకు అడుగడుగునా తూట్లు
- ఇసుక దిబ్బలు, సర్వే తోటలు, మడ అడవులు తొలగించి మరీ సాగు
- నదీ గర్భంలో సైతం దందా
- రాజోలు దీవిపై మాత్రమే ఎన్‌జీటీకి ఫిర్యాదు
- మిగిలిన చోట్ల యథాతథంగా సాగు

సాక్షి, అమలాపురం: సముద్రం తీరం, నదీ గర్భాలను ధ్వంసం చేస్తూ పర్యావరణానికి పెను ముప్పుగా మారిన ఆక్వా చెరువులను ధ్వంసం చేయాలని జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) ఇచ్చిన తీర్పు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని తీర ప్రాంత ఆక్వా రైతుల్లో కొత్త ఆందోళనకు దారి తీస్తోంది. కోస్టల్ రెగ్యులైజేషన్ జోన్ (సీఆర్‌జెడ్) నిబంధనలకు విరుద్ధంగా సముద్ర తీరం, గోదావరి లంకలు, ఏటిగట్లను ఆనుకుని వందల ఎకరాల్లో ఆక్వా సాగు జరుగుతున్న విషయం తెలిసిందే. ఇప్పుడు ఈ చెరువుల మీద కూడా ఎన్‌జీటీ కత్తి వేలాడుతోంది.

ఉమ్మడి జిల్లా పరిధిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ జిల్లాల్లో అధికారికంగా 12 వేల ఎకరాల్లో ఆక్వా సాగు జరుగుతోంది. కానీ, అనధికారికంగా ఇంతకు రెండు రెట్లు సాగవుతోంది. వెనామీ రొయ్యల సాగుకు అనుమతి పొందాలంటే పలు నిబంధనలున్నాయి. చప్పనీటి చెరువుల సాగు పేరుతో (చేపల సాగు) అనుమతులు తెచ్చుకుని పలువురు అనధికారికంగా ఉప్పు నీటి సాగు చేస్తున్నారు. డెల్టా ప్రాంతంలో అన్ని రకాల అనుమతులూ ఉన్న చెరువులు 10 శాతం కూడా ఉండవంటే అతిశయోక్తి కాదు. ఇవి కాకుండా సీఆర్‌జెడ్ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా చెరువుల తవ్వకాలు పెద్ద ఎత్తున సాగాయి. గడచిన రెండున్నర దశాబ్దాల్లో అటు తీర ప్రాంతంలో శివారు ఏటిగట్లను, ఇటు గోదావరి ఏటిగట్లను ఆనుకుని ఆక్వా సాగు చేయడం పెను ప్రమాదానికి కారణమవుతోంది. రాజోలు దీవిలో సీఆర్‌జెడ్ పరిధిలో అనధికారికంగా సాగు జరుగుతున్న ప్రాంతాల పైనే ఆ ప్రాంత వాసులు ఎన్‌జీటీని ఆశ్రయించారు. అందువలన వాటిని తొలగించాలనే తీర్పు వచ్చింది. అయితే, ఇది మిగిలిన ప్రాంతాల్లో అక్రమంగా ఆక్వా సాగు చేస్తున్న రైతుల్లో ఆందోళనకు కారణమవుతోంది. తమ మీద కూడా ఎన్‌జీటీ పిడుగు పడుతుందేమోనని వారు కలవరపడుతున్నారు.



ఉప్పలగుప్తం మండలం ఎస్.యానాంలో సీఆర్‌జెడ్ పరిధిలో ఉన్న ఆక్వా చెరువులు

సముద్ర తీరాన్ని ఆనుకుని..

కాకినాడ జిల్లా తొండంగి నుంచి కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం వరకూ తీరం పొడవునా ఆక్వా చెరువులున్నాయంటే అతిశయోక్తి కాదు. సముద్ర తీరాన్ని ఆనుకుని గతంలో పెద్ద ఎత్తున వరి, సరుగుడు, కొబ్బరి సాగు జరిగేది. తరువాత కాలంలో వీటిని తొలగించి ఆక్వా చెరువులు తవ్వారు. అల్లవరం మండలం ఓడలరేవు, కొమరగిరపట్నం, కాట్రేనికోన మండలం చిర్రయానాం, సఖినేటిపల్లి మండలం అంతర్వేది, మలికిపురం మండలం కేశనపల్లి వంటి ప్రాంతాల్లో నేరుగా సముద్రం నుంచి ఆక్వా చెరువుల్లోకి ఉప్పు నీరు తోడుతున్నారు. దీనినిబట్టి సముద్ర తీరంలో అక్రమ చెరువుల తవ్వకాలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. చెరువులతో పాటు రొయ్యల సీడ్ ఉత్పత్తి చేసే కంపెనీలు సైతం సీఆర్‌జెడ్ పరిధిలో ఉన్నాయి. కాకినాడ, కోనసీమ జిల్లాల్లో సుమారు 3 వేల ఎకరాల్లో ఈ సాగు జరుగుతోందని అంచనా.



అల్లవరం మండలం ఓడలరేవు తీరంలో అనధికార ఆక్వా చెరువులు

గోదావరి గట్లను ఆనుకుని..

ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలు అన్నపూర్ణగా పేరొందడానికి పావన జీవనది గోదావరే కారణం. అదే గోదావరి కన్నెర్ర చేసి వరదగా వచ్చి పడితే పెను విషాదాన్ని మిగులుస్తోంది. రక్షణగా ఉన్న ఏటిగట్లు తెగి పడి ఆస్తి, ప్రాణ నష్టాలు చోటు చేసుకున్న విషాద ఉదంతాలు పలు జరిగాయి. ఈ ముప్పును నివారించేందుకే ఏటిగట్లను పటిష్టపరచి, వాటికి రక్షణ కల్పిస్తుంటారు. బ్రిటిష్ పాలనలోనే మద్రాస్ కన్జర్వెన్సీ యాక్టు ప్రవేశపెట్టారు. దీని ప్రకారం ఏటిగట్టు నుంచి నదీ గర్భంలో 100 నుంచి 150 మీటర్ల వరకూ ఎటువంటి తవ్వకాలూ చేయరాదు. నదీ ప్రవాహానికి అడ్డంగా నిర్మాణాలు చేయకూడదు.

కానీ, ఉమ్మడి జిల్లాలో దీనిని యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నారు. ఏటిగట్లను ఆనుకుని పెద్ద ఎత్తున ఆక్వా చెరువులు తవ్వేస్తున్నారు. ఐ.పోలవరం మండలం మురమళ్ల, ఎదుర్లంక, గోగుల్లంక, భైరవలంక; కాట్రేనికోన మండలం చింతపల్లి లంక, నడవపల్లి, పల్లంకుర్రు, బలుసుతిప్ప; ముమ్మిడివరం మండలం అన్నంపల్లి, లంకాఫ్ ఠాణేలంక; పి.గన్నవరం మండలం పి.గన్నవరం, కె.ఏనుగుపల్లితో పాటు అయినవిల్లి మండలం, కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం గోవలంక పరిధిలోని అరటికాయ లంకల్లో సహితం ఏటిగట్లను ఆనుకుని అక్రమ చెరువులు పెద్ద ఎత్తున సాగవుతున్నాయి. దీనివల్ల గట్ల ఉనికి ప్రమాదకరంగా మారింది. అలాగే లంకల్లో చెరువు చుట్టూ వేస్తున్న గట్ల వలన ప్రవాహ దిశ మారి కూడా ఏటిగట్లు దెబ్బ తింటున్నాయి. దీనివలన వరదల సమయంలో గండ్లు పడే ప్రమాదం పొంచి ఉంది.

మడ అడవుల ధ్వంసం

ఉమ్మడి జిల్లాలో మడ అడవులు విస్తారంగా ఉన్నాయి. తుపాన్లు, సునామీ వంటి విపత్తుల నుంచి ఇవి తీర ప్రాంతానికి ఎంతో రక్షణ కల్పిస్తాయి. అంతే కాదు.. సముద్రం ముందుకు చొచ్చుకురావడం వలన పెరుగుతున్న కోత నుంచి కూడా రక్షణ కల్పిస్తున్నాయి. తాళ్లరేవు మండలం కోరంగి, కాట్రేనికోన, అల్లవరం, సఖినేటిపల్లి మండలాల్లో అధిక సాంద్రతతో ఉన్న ఇటువంటి మడ అడవులను కూడా తొలగించి మరీ ఆక్వా చెరువులు తవ్వేశారు. కోరంగి అభయారణ్యంలో వందల ఎకరాల్లో మడ అడవులు ధ్వంసమయ్యాయి. అల్లవరం మండలం నక్కా రామేశ్వరం; ఉప్పలగుప్తం మండలం ఎస్.యానాం, వాసాలతిప్ప; కాట్రేనికోన మండలం పల్లం, నీళ్లరేవు, చిర్రయానాం, కొత్తపాలెం లైట్ హౌస్ వరకూ చెరువులు తవ్వి పీతలు, రొయ్యలు సాగు చేస్తున్నారు. ఈ చెరువులు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నప్పటికీ.. అధికారులు కళ్లు మూసుకోవడంతో ఈ చెరువులకు ప్రభుత్వం నుంచి రాయితీలు, బ్యాంకుల నుంచి రుణాలు, ఉచిత విద్యుత్ వంటివి అందుతున్నాయి. దీంతో అక్రమ ఆక్వా సాగుకు అడ్డూ అదుపూ లేకుండా పోతోంది. దీనికి ఎన్‌జీటీ రూపంలోనైనా కళ్లెం పడితే తీర ప్రాంతానికి మేలు జరుగుతుందని ప్రకృతి ప్రేమికులు ఆశిస్తున్నారు.



ఐ.పోలవరం మండలం ఎదుర్లంక వద్ద గౌతమీ నదీపాయను ఆనుకుని ఆక్వాసాగు



కాట్రేనికోన మండలం నీళ్లరేవు వద్ద మడ అడవిని ధ్వంసం చేసి, తవ్విన ఆక్వా చెరువు

మండపేటలో మహిళల మండిపాటు

- జనావాసాల్లో మద్యం దుకాణంపై ఆగ్రహం
- రిలే నిరాహార దీక్షలు ప్రారంభం

మండపేట: జనావాసాల నడుమ మద్యం దుకాణం ఏర్పాటు చేయడంపై మండపేట మహిళలు మండిపడ్డారు. ఆ షాపును తొలగించాలని డిమాండ్ చేస్తూ శనివారం రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. వివరాలివీ.. మండపేట 28, 29, 30 వార్డులకు అనుసంధానంగా ఉన్న సత్యశ్రీ రోడ్డులో గతంలో మద్యం షాపును తాత్కాలికంగా ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేశారు. దీనిపై స్థానికులు ఆందోళన చేయడంతో అప్పట్లో ఎక్సైజ్ అధికారులు ఆ షాపును తొలగించారు. ఇప్పుడు అదే రోడ్డులో సప్తగిరి థియేటర్ ఎదురుగా శాశ్వతంగా మద్యం దుకాణం పెట్టేందుకు నిర్వాహకులు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వం పుణ్యమా అని పట్టణంలోని అనేక ప్రాంతాల్లో మద్యం షాపులు పెట్టి ప్రజల జీవితాలతో ఆటలాడుకుంటున్నారు. అది చాలదన్నట్లు కొత్తగా కల్లుగీత కార్మికుల కోటాలో వచ్చిన మద్యం దుకాణాన్ని జనావాసాల నడుమ ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. దీనిపై మండిపడుతున్న మహిళలు, స్థానికులు ఈ షాపు ఏర్పాటును వ్యతిరేకిస్తూ ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. సుమారు 50 మంది మహిళలు షాపు ఎదురుగా టెంట్ వేసి తొలి రోజు దీక్షల్లో కూర్చున్నారు. 'మా ప్రాంతంలో మద్యం కొలిమి పెట్టొద్దని మూడు వార్డుల ప్రజలు ముక్తకంఠంతో వ్యతిరేకిస్తుంటే పట్టించుకోకుండా దుకాణం పెడతారా?' అంటూ వారు ఫైరయ్యారు. ఇది నిత్యం వందలాది మంది ప్రయాణించే రోడ్డు అని, ఈ ప్రాంతంలో మూడు సినిమా థియేటర్లు కూడా ఉన్నాయని, సినిమాలకు వచ్చే ప్రేక్షకులతో ఈ మార్గం పగలు, రాత్రి రద్దీగా ఉంటుందని చెప్పారు. అలాగే, ఈ ప్రాంతంలో పాఠశాలలు కూడా ఉన్నాయని, తెల్లవారితే విద్యార్థులు ఈ రోడ్డు వెంబడే పాఠశాలలకు వెళ్లాలని, నివాస ప్రాంతాలు, జనసమ్మర్దం ఎక్కువగా ఉన్న ఇటువంటి చోట ఏవిధంగా మద్యం దుకాణం పెడతారో చెప్పాలని మహిళలు ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వంలో అధికారులు మద్యం వ్యాపారులకు వత్తాసు పలకడం ఆశ్చర్యంగా ఉందన్నారు. మద్యం షాపు తొలగించేంత వరకూ ఆందోళనల విరమించేది లేదని స్పష్టం చేశారు. రిలే దీక్షా శిబిరంలోని మహిళలతో సీఐ సురేష్ చర్చించారు. ప్రభుత్వం నిబంధనల ప్రకారం వెళ్తుందని, శాంతియుతంగా నిరసన తెలపాలని, లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. దీక్షల్లో షేక్ అఫ్రోజ్, పోతుల కీర్తి, తోట పార్వతి, వనపర్తి మౌనిక, తోట కనక మహాలక్ష్మి, వాసంశెట్టి పద్మావతి తదితరులు పాల్గొన్నారు.



మద్యం షాపు వద్దంటూ రిలే దీక్షలు చేపట్టిన మహిళలు

పాఠశాల భవనం కూల్చివేత



జేసీబీతో పాఠశాల భవనం కూల్చివేస్తున్న దృశ్యం



మట్టిని తరలించడానికి సిద్ధం చేసిన ట్రాక్టర్

- మెటీరియల్ తరలించేందుకు యత్నం
- పోలీసులకు ఫిర్యాదు

అయినవిల్లి: పాత ప్రభుత్వ పాఠశాల భవనాన్ని కొందరు వ్యక్తులు దౌర్జన్యంగా కూల్చివేసిన సంఘటన మండలంలోని వెలువలపల్లిలో చోటు చేసుకుంది. వివరాలివీ.. గ్రామంలోని పాత పోస్టాఫీసు వీధిలో పాత పాఠశాల భవనం ఉంది. నూతన పాఠశాల భవనం నిర్మించిన అనంతరం, మండల పరిషత్ నిధులతో పాత భవనానికి మరమ్మతులు చేశారు. అనంతరం ఆ భవనంలో మధ్యాహ్న భోజన పథకం వంటశాల ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో కొంత మంది స్థానికులు పాత భవనంలో పాడి గేదెలను కట్టి, పరిసరాలను పాడు చేశారు. దీనిపై స్థానిక అధికారులతో పాటు జిల్లా కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ స్థానిక ఎంపీడీఓ, ఎంఈఓలు ఈ విషయం తమ పరిధిలోనిది కాదని చెబుతూ సమస్యను పరిష్కరించలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా మోత బాబూరావు, తదితరులు శనివారం వచ్చి పాఠశాల భవనాన్ని దౌర్జన్యంగా కూల్చివేశారని, ప్రభుత్వ ఆస్తిని ధ్వంసం చేసి, సిమెంటు రేకులు, దూలాలు, ఇటుక తదితర మెటీరియల్‌ను ట్రాక్టర్‌పై తరలించుకుని పోయేందుకు ప్రయత్నించారని స్థానికులు తెలిపారు. వారికి అయినవిల్లిలంకకు చెందిన జేసీబీ ఆపరేటర్ సహకరించాడని చెప్పారు. దీనిపై స్థానికులు అధికారులకు సమాచారం ఇచ్చారు. దీనిపై ప్రధానోపాధ్యాయిని జి.లలితాదేవి, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్‌పర్సన్ నూకపెయ్యి దుర్గాదేవి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ జరిపిన అనంతరం, ఈ ఘటనపై కేసు నమోదు చేస్తామని ఎస్సై హరికోటిశాస్త్రి చెప్పారు.

క్లుప్తంగా

నేడు రాష్ట్ర స్థాయి ఎడ్ల పరుగు పోటీలు

సిద్ధమైన 45 జతల ఎడ్లు



రాష్ట్ర స్థాయి ఎడ్ల పరుగు పోటీలకు సై అంటున్న ఎడ్లు

సామర్లకోట: స్థానిక ఉండూరు రైల్వే గేటు వద్ద ఎన్ఎఫ్సీఎల్ రోడ్డులో ఆదివారం రాష్ట్ర స్థాయి ఎడ్ల పరుగు పోటీలు జరుగుతున్నాయి. ఈ మేరకు సీనియర్ విభాగం నుంచి 8 జతలు, జూనియర్ విభాగం నుంచి 37 జతల ఎడ్లు కృష్ణ, ప్రకాశం, నెల్లూరు, విశాఖ, పశ్చిమ, తూర్పు గోదావరి జిల్లాల నుంచి ఉండూరుకు చేరుకున్నాయి. శ్రీ కుమారా రామ భీమేశ్వర ఎడ్ల పరుగు పోటీలు వల్లూరి సత్యేంద్రకుమార్ మెమోరియల్ పేరుతో ఎడ్ల పరుగు పోటీల్లో పాల్గొనే రైతులే ఏర్పాటు చేయడం విశేషం. మాజీ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ చందలాడ అనంత పద్మనాభం పోటీలను ప్రారంభిస్తారని నిర్వాహకులు వల్లూరి దొరబాబు, సీతారామరాజు, బిక్కిన రంగనాయకులు, చేకూరి రామకృష్ణ, మలిరెడ్డి వీరేంద్రలు తెలిపారు. సీనియర్ విభాగంలో మూడు, జూనియర్ విభాగంలో ఐదు బహుమతులను ఇవ్వనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. సీనియర్ విభాగంలో కిలోమీటరున్నర, జూనియర్ విభాగంలో కిలోమీటరు దూరాన్ని ఎడ్లు పరుగెత్తాల్సి ఉంటుందన్నారు.

బాలికలపై అత్యాచారయత్నం



అత్యాచార యత్నానికి పాల్పడిన వ్యక్తికి దేహశుద్ధి చేస్తున్న స్థానికులు

పెద్దాపురం: ఇద్దరు బాలికలపై అత్యాచారయత్నానికి పాల్పడిన వ్యక్తికి స్థానికులు దేహశుద్ధి చేశారు. స్థానికుల కథనం మేరకు శనివారం స్థానిక దర్గా సెంటర్‌లో వ్యాపారం చేసుకుంటున్న కామేశ్వరరావు రెండు, ఏడో తరగతి చదువుతున్న ఇద్దరు బాలికలపై అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. బాలికల అరుపులతో స్థానికులు అక్కడికి చేరుకుని దేహశుద్ధి చేసి స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అతడు అక్కడ చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనపై ఎస్ఐ మౌనికను వివరణ కోరగా తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని, విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

టెక్నిక్‌తో జీవితం సెట్

- ఏప్రిల్ 30న పాలిసెట్
- జిల్లాలో 8 పాలిటెక్నిక్ కళాశాలలు
- అందుబాటులో 1820 సీట్లు



బొమ్మూరులోని జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాల

రాజమహేంద్రవరం రూరల్: ప్రపంచం సాంకేతికంగా దూసుకుపోతోంది. ఆ వేగాన్ని అందుకోవాలనే లక్ష్యంతో నేటి యువత సైతం తత్సంబంధమైన విషయ పరిజ్ఞానాన్ని అభ్యసించేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. ఇంజినీరింగ్‌లో సైతం కంప్యూటర్ ఆధారిత కోర్సుల వైపే మొగ్గు చూపుతున్నారు. ఇంజినీరింగ్ పూర్తి చేసే విద్యార్థుల కంటే ముందుగానే ఉద్యోగాల్లో స్థిరపడే అవకాశం పాలిటెక్నిక్ ఉత్తీర్ణులకు లభిస్తుంది. దీంతో పదో తరగతి పూర్తిచేసిన విద్యార్థులు పాలిటెక్నిక్ కోర్సులపై దృష్టిపెడుతున్నారు.

సాంకేతిక విద్యకు పునాది

సాంకేతిక విద్యకు పునాది వేసే పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాలకు ఏప్రిల్ 30వ తేదీన పాలిసెట్ జరగనుంది. ఈ మేరకు సాంకేతిక విద్యాశాఖ పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్–2025ను ప్రకటించింది. పాలిటెక్నిక్ ప్రవేశం ద్వారా తక్కువ ఖర్చుతో ప్రాథమికంగా సాంకేతిక విద్య లభిస్తే దానిని పునాదిగా మార్చుకుని భావి జీవితానికి బాటలు వేసుకునే అవకాశం లభిస్తుంది. గ్రామీణ పేద విద్యార్థులకు ఇంజినీరింగ్ ఎక్కువ ఖర్చుతో కూడుకున్నది. వారికి పాలిటెక్నిక్ కోర్సులు చక్కని వేదికలని పలువురు సాంకేతిక నిపుణులు చెబుతున్నారు. పాలిసెట్ ద్వారా పలు కోర్సులతో సాంకేతిక విజ్ఞాన్ని సొంతం చేసుకుని సత్వర ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పొందవచ్చని సూచిస్తున్నారు.

ఏప్రిల్ 15 తుది గడువు

పాలిసెట్ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. ఈ మేరకు రాష్ట్ర సాంకేతిక విద్య, శిక్షణా మండలి ఈ నెల పదో తేదీన నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనికి ఈ నెల 12వ తేదీ నుంచే ఫీజులను ఆన్‌లైన్‌లో గేట్‌వే ద్వారా చెల్లించే సౌకర్యం అందుబాటులో ఉంచారు. పాలిసెట్ ప్రవేశ పరీక్ష రాయదలుచుకున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి ఏప్రిల్ 15వ తేదీ వరకు గడువు ఉంది. 10వ తరగతి, తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణులైన వారు, ఈ ఏడాది అటువంటి పరీక్షలు రాస్తున్నవారు కూడా పాలిసెట్‌కు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. పాలిసెట్ ఎంట్రన్స్ పరీక్ష 120 మార్కులకు నిర్వహిస్తారు. పదో తరగతి సిలబస్ ఆధారంగా ఈ పరీక్ష జరుగుతుంది. ఈ ఏడాది ఏప్రిల్ 30న పాలిటెక్నిక్ ఎంట్రన్స్ పరీక్ష నిర్వహిస్తారు. ఈ పరీక్ష రాయడానికి ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.100, ఓసీ, బీసీ విద్యార్థులు రూ.400 ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.

లభించే కోర్సులు ఇవీ..

పాలిటెక్నిక్‌లో వివిధ కోర్సులను జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలలు అందిస్తున్నాయి. ఆయా కళాశాలల్లో కంప్యూటర్, ఎలక్ట్రానిక్స్ అండ్ కంప్యూటర్, ఎలక్ట్రికల్, మెకానికల్, సివిల్, ఆర్కిటెక్చర్ తదితర కోర్సులు అందుబాటులో ఉంటాయి. పలు చోట్ల ఒక్కో కోర్సులో ఒక్కో బ్రాంచికి 60 నుంచి 120 వరకు సీట్లు అందుబాటులో ఉంటాయి. పాలిటెక్నిక్ కోర్సుల కాల వ్యవధి మూడేళ్ల వరకు ఉంటుంది. ఆరు నెలల పాటు విద్యార్థులకు పారిశ్రామిక శిక్షణ కూడా ఉంటుంది. విద్యార్థుల నైపుణ్యాన్ని పెంపొందించేందుకునే శిక్షణ సైతం ఇస్తారు.

జిల్లాలో 8 కళాశాలలు

జిల్లాలో విద్యార్థులకు మొత్తం 8 పాలిటెక్నిక్ కళాశాలల్లో 1820 సీట్లు అందుబాటులో ఉన్నాయి. వాటిలో బొమ్మూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీఎంఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, అనపర్తిలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, రాజానగరం గైట్ పాలిటెక్నిక్, రాజానగరం ఐఎస్టీఎస్ మహిళా పాలిటెక్నిక్ కళాశాల, పిడింగొయ్యిలోని రైట్ పాలిటెక్నిక్, పాలచర్లలోని బీవీసీ పాలిటెక్నిక్, కొండగుంటూరు ఎస్ఎస్ పరిమళ పాలిటెక్నిక్, బూరుగపల్లి బెన్నయ్య పాలిటెక్నిక్ కళాశాలలు ఉన్నాయి.

పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

బొమ్మూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పాలిటెక్నిక్ కళాశాలలో పాలిసెట్‌కు హాజరయ్యే విద్యార్థులకు ఏప్రిల్ మూడో తేదీ నుంచి ఉచిత శిక్షణ ఇస్తున్నారు. ఉచిత శిక్షణతో పాటు ప్రవేశపరీక్షకు సంబంధించి స్టడీ మెటీరియల్ సైతం ఉచితంగా అందజేస్తారు. ఆసక్తి గల విద్యార్థులు ముందుగా పాలిటెక్నిక్ కళాశాలలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి.

సద్వినియోగం చేసుకోవాలి



పదో తరగతి ముగిసిన వెంటనే పాలిటెక్నిక్ చదివితే చిన్న వయసులోనే ఉద్యోగావకాశాలు లభిస్తాయి. ఉన్నత విద్యతో పాటు స్వయం ఉపాధి అవకాశాలు ఉంటాయి. పాలిసెట్‌కు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు బొమ్మూరులోని జీఎంఆర్ పాలిటెక్నిక్‌లో ఉచిత శిక్షణతో పాటు స్టడీమెటీరియల్ ఇస్తారు. పాలిటెక్నిక్ పూర్తయిన తరువాత ఇంజినీరింగ్ ద్వితీయ సంవత్సరంలో చేరవచ్చు. లేదా ఉద్యోగానికి ప్రయత్నించవచ్చు.

– వి.నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్, బొమ్మూరు జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాల, ఏపీ పాలిసెట్ జిల్లా కో–ఆర్డినేటర్

మెగా డీఎస్సీపై మొదటి సంతకం ఏమైంది?

కూటమి హామీలపై ధ్వజమెత్తిన ఏఐవైఎఫ్



జాతీయ మహాసభల లోగోను ఆవిష్కరిస్తున్న ఏఐవైఎఫ్ జిల్లా ప్రతినిధులు

అమలాపురం టౌన్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి అప్పుడే తొమ్మిది నెలలు గడుస్తున్నా ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల అమలు మాటే మరిచిందని ఏఐవైఎఫ్ జిల్లా శాఖ అధ్యక్షుడు రెడ్డి సతీష్ కుమార్ ధ్వజమెత్తారు. అమలాపురంలోని ఎస్టీయూ జిల్లా కార్యాలయంలో 17వ ఏఐవైఎఫ్ జాతీయ మహాసభల లోగోను జిల్లా శాఖ ప్రతినిధులు శనివారం ఆవిష్కరించారు. సతీష్‌కుమార్, కార్యదర్శి యనమదల ఉమేష్ తదితరులు కూటమి ప్రభుత్వ హామీల వైఫల్యాలను ఎండగట్టారు. మెగా డీఎస్సీ అంటూ అధికారంలోకి వచ్చిన రోజు మొదటి సంతకంగా చేసినా నేటికీ చర్యలు లేవని ఆరోపించారు. నిరుద్యోగ భృతిపై ప్రకటన చేయాలని వారు డిమాండ్ చేశారు. జిల్లాలోని ఓఎన్జీసీ వనరులను గుజరాత్, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాలకు తరలిస్తున్న పరిణామాలపై ఏఐవైఎఫ్ జిల్లా శాఖ ప్రతినిధులు దుయ్యబట్టారు. తిరుపతిలో వచ్చే మే 15వ తేదీ నుంచి ఏఐవైఎఫ్ 17వ జాతీయ మహా సభల్లో కూటమి ప్రభుత్వం వైఫల్యాలను చర్చించనున్నట్టు వారు తెలిపారు. జతీయ మహాసభల లోగో ఆవిష్కరణలో ఏఐవైఎఫ్ జిల్లా కోశాధికారి యాండ్ర నాగరాజు, జిల్లా శాఖ సభ్యులు నిమ్మకాయల కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో వ్యక్తి అరెస్టు

గోపాలపురం: పోక్సో కేసులో వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు గోపాలపురం ఎస్సై కర్రి సతీష్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గోపాలపురం మండలం భీమోలు పంచాయతీ పరిధిలోని తొక్కిరెడ్డిగూడేనికి చెందిన బాలిక కనిపించడం లేదని తల్లితండ్రులు నక్కా కిషోర్, గంగ ఇచ్చిన ఫిర్యాదు చేశారని అన్నారు.

ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేశామని, ఆ కేసును పోక్సో కిడ్నాప్ కేసుగా నమోదు చేసి ముద్దాయి గుడ్డిగూడెం గ్రామానికి చెందిన పెదపాటి రాజేష్‌ను అరెస్ట్ చేసి కోర్టుకు తరలించగా అతనికి రిమాండ్ విధించినట్లు ఎస్సై సతీష్‌కుమార్ తెలిపారు.

అనర్హులే పట్టు సాధించారు

- అర్హులకు అందని ప్రోత్సాహం
- చేబ్రోలు పట్టు పరిశ్రమ అధికారుల మాయాజాలం
- ఆందోళన చేపట్టిన రైతులు

పిఠాపురం: అనర్హులకు ప్రోత్సాహకాలు అందిస్తున్నారని మల్బరీ రైతులు ఆందోళనకు దిగారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలు పట్టు పరిశ్రమ అధికారులు సిఫార్సులకు ప్రాధాన్యమిచ్చి అర్హులను విస్మరించారని రైతులు ఆరోపిస్తున్నారు. 53.19 ఎకరాల్లో 26 మంది రైతులను గుర్తించి, ఇందులో 20 ఎకరాలు దాటి మల్బరీ సాగు చేయలేదని రైతులు వాపోయారు. నువ్వులు ఇతర పంటలు సాగు చేసిన వారికి కూడా మల్బరీ నర్సరీ ప్రోత్సాహం ఎకరానికి 22,500 చొప్పున ఇస్తున్నారని, ఇందులో అర ఎకరం సాగు చేసిన వారికి కూడా రెండు నుంచి నాలుగు ఎకరాలలో వేసినట్టు నమోదు చేశారని పట్టు రైతులు ఆరోపించారు.

అనర్హులకు పరిహారం

గత ఏడాది గూళ్లు నష్టపోయిన వారికి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ రూ.11,30,000 సహాయం అందించినప్పటికీ అధికారులకు నచ్చిన రైతులకే పరిహారం అందించారని, మిగిలిన వారిని వదిలేసారని రైతులు ఆరోపిస్తున్నారు. ఇన్‌సెంటీవ్‌లు కూడా సీరియల్ పాటించట్లేదని వారు పేర్కొన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించకుండా ఇష్టం వచ్చిన వారి పేర్లు నమోదు చేసి, అర్హులకు మొండి చేయి చూపారని రైతులు ఓరుగంటి చక్రధర్ రావు, సూరిబాబు, ఉలవల సురేష్, చక్రి వెలుగుల మాణిక్యం తదితరులు కోరుతున్నారు.



చేబ్రోలు పట్టు పరిశ్రమల కేంద్రం వద్ద ఆందోళన చేస్తున్న మల్బరీ రైతులు

అధికారులు అన్యాయం చేశారు



గత ఏడాది నాలుగు ఎకరాల్లో మల్బరీ సాగు చేపట్టాను. గూళ్లు సక్రమంగా రాకపోవడంతో పట్టు పరిశ్రమ అధికారుల సూచనతో పంట తొలగించి నువ్వు చేను వేశాను. గుళ్లు కట్టిన రైతులకు అప్పటి ప్రభుత్వం నష్టపరిహారం అందించింది. అందులో కూడా తనను గుర్తించలేదు. నర్సరీ వేసిన వెంటనే ఎకరానికి 22,500 చొప్పున ఇవ్వాల్సిన ప్రోత్సాహం కూడా అందించలేదు. అధికారుల నిర్వాకం వల్ల రూ.మూడు లక్షల వరకు నష్టపోయాను.

– ఓరుగంటి సూరిబాబు, పట్టు రైతు, చేబ్రోలు

అర్హులకే ఇస్తున్నాం



మల్బరీ సాగు చేసిన రైతులనే నర్సరీ ప్రోత్సాహకాలు అందించడానికి గుర్తించాం. అలాగే గూళ్ల నష్టం కూడా కొంతమంది రైతులకు అందకపోవటం వాస్తవమే. వారిని రెండో జాబితాలో పెట్టాము. అది ప్రభుత్వం నుంచి ఇంకా రాలేదని ఇన్‌సెంటీవ్ పాత సీరియల్ ప్రకారమే అందిస్తాం. ఎవరైతే ఆరోపణ చేస్తున్నారో ఆ రైతులు ఎనిమిది ఎకరాలు మల్బరీ సాగు చేసినప్పటికీ ఇప్పుడు నువ్వు చేలు వేసుకున్నారు.

– టి.మోసయ్య, పట్టు పరిశ్రమ అధికారి, చేబ్రోలు

గాంధీకాలనీలో అంబేడ్కర్‌కు అవమానం

- విగ్రహానికి చెప్పుల దండ వేసిన దుండగులు
- ఆందోళన చేపట్టిన రిజర్వేషన్ల వ్యతిరేక పోరాట సమితి
- బాధ్యులపై చర్యలు తీసుకోవాలని మాజీ హోం మంత్రి వనిత డిమాండ్



ఏఎస్పీ సుబ్బరాజుకు వినతి పత్రం అందజేస్తున్న మాజీ హోం మంత్రి తానేటి వనిత

నల్లజర్ల: మండలం దూబచర్ల శివారు గాంధీకాలనీలో రహదారి పక్కనున్న అంబేడ్కర్ విగ్రహానికి గుర్తు తెలియని వ్యక్తులు చెప్పుల దండ వేయడం ఉద్రిక్తతలకు దారితీసింది. శనివారం ఉదయం విగ్రహానికి చెప్పులదండ ఉండటం చూసి అంబేడ్కర్ అభిమానులు, రిజర్వేషన్ వ్యతిరేక పోరాట సమితి సభ్యులు ఆందోళనకు దిగడంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. నిందితులను కఠినంగా శిక్షించాలంటూ దూబచర్ల–లక్కవరం రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేశారు. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన ఆందోళన 11 గంటల వరకు జరుగుతూనే ఉంది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని చెప్పుల దండను తొలగించి క్లూస్ టీం, డాగ్‌స్కాడ్‌లను రంగంలోకి దింపారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అక్కడికి చేరుకుని ఆందోళన కారులతో మాట్లాడి అంబేడ్కర్ ఆశయాల కోసం పనిచేయాలంటూ పిలుపునిచ్చారు. విద్వేషాలు రెచ్చగొట్టే వారిని అరెస్ట్ చేయాలని కోరారు. అనంతరం మాజీ హోంమంత్రి, గోపాలపురం నియోకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి తానేటి వనిత సంఘటనా స్థలానికి వచ్చి ఆందోళనకారులకు మద్దతు ప్రకటించారు. ఈ ఘటన హేయమైన చర్య అని, పోలీసులు పూర్తి స్థాయి దర్యాప్తు చేయించి నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. ఇక్కడి విగ్రహాన్ని తొలగించి నూతన విగ్రహం ఏర్పాటు చేసి పైన రూఫ్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. వారు ఏర్పాటు చేయకపోతే తమ పార్టీ ఏర్పాటు చేస్తుందని వెల్లడించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండలశాఖ అధ్యక్షులు వెల్లంకి వెంకట సుబ్రమణ్యం, నాయకులు బంక అప్పారావు, ముప్పిడివెంకటరత్నం, సాలి వేణు, తొమ్మండ్రు రమేష్, నక్కా పండు, పంది సత్యనారాయణ, తొమ్మండ్రు రవి, పెండ్యాల హరేరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఏఎస్పీ సుబ్బరాజు, డీఎస్పీ దేవకుమార్, నల్లజర్ల, దేవరపల్లి, కొవ్వూరు సీఐల ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి నివాళులర్పించారు.

ఇంటి తాళాలు పగులగొట్టి చోరీ

- ఐదు కాసుల బంగారు నగలు,
- 300 గ్రాముల వెండి వస్తువుల అపహరణ



చెల్లాచెదురుగా ఉన్న బీరువాలోని సామాన్లు

పి.గన్నవరం: మండలంలోని ఊడిమూడి శివారు ఆదిమూలం వారి పాలెంలో దొంగలు ఒక ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలోని ఐదు కాసుల బంగారు నగలు, 300 గ్రాము ల వెండి వస్తువులను చోరీ చేశారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని ఆదిమూలం రాజరాజేశ్వరి 15 రోజుల క్రితం హైదరాబాద్‌లోని కుమార్తె ఇంటికి వెళ్లారు. ఆమె సోదరుడు ఊడిమూడికి చెందిన కొండ్రెడ్డి కాశీ విశ్వనాథ్ అప్పుడప్పుడూ వచ్చి రాజరాజేశ్వరి ఇంటిని పరిశీలించి వెళ్తున్నారు. గత సోమవారం చివరగా ఆమె ఇంటిని చూసి వెళ్లాడు. ఇటీవల అదే గ్రామంలోని చింతావారిపేటలో దొంగతనం జరిగిన నేపథ్యంలో.. శనివారం ఉదయం సోదరి ఇంటిని పరిశీలించేందుకు కాశీ విశ్వనాథ్ ఆ ఇంటికి వచ్చి వెనుక తలుపులు పగులగొట్టి ఉండటాన్ని గమనించి సోదరికి సమాచారం అందించారు. ఇంట్లోని బీరువాలు పగులగొట్టి, సామాన్లు చిందరవందరగా ఉండడం, బంగారు, వెండి వస్తువులతో పాటు, రూ.25 వేల నగదును తస్కరించినట్టు వారు గుర్తించారు.

భక్తులతో శోభిల్లిన వాడపల్లి

- వైభవంగా పూజాదికాలు
- ఏడు వారాల ప్రదక్షిణలు చేసిన భక్తులు



వాడపల్లి వేంకటేశ్వరస్వామి దర్శనానికి క్యూలైన్లలో భక్తులు

కొత్తపేట: కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వర క్షేత్రం భక్తజనంతో శోభిల్లింది. ఖండవిల్లి ఆదిత్య అనంత శ్రీనివాస్ ఆధ్వర్యంలో అర్చకులు వేద పండితులు స్వామివారికి ఉదయం సుప్రభాత సేవ, నీరాజన మంత్రపుష్పం నిర్వహించారు. తిరుప్పావై ద్రవిడ వేదపారాయణం చేసి సుందరంగా అలంకరించారు. వేంకటేశ్వర సహిత ఐశ్వర్యలక్ష్మీ హోమం నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. ఏడు శనివారాల నోము ఆచరిస్తున్న భక్తులు మాడ వీధుల్లో ఏడు ప్రదక్షిణలు చేశారు. గోవింద నామస్మరణతో వాడపల్లి మార్మోగింది. 11 గంటల నుంచి నుంచి వేలాది మందికి అన్న సమారాధన చేశారు. దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు ఆధ్వర్యంలో సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎస్సై రాము ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

రద్దీ మేరకు ఏర్పాట్లు

వాడపల్లి క్షేత్రానికి పెరుగుతున్న భక్తుల సంఖ్యకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాల్సి ఉందని డీఎస్పీ సుంకర మురళీమోహన్ అన్నారు. శనివారం ఆయన క్షేత్రాన్ని సందర్శించి క్యూలైన్లను, పార్కింగ్ స్థలాలను పరిశీలించి భక్తులకు ఎదురవుతున్న సమస్యలను గుర్తించారు. ఈఓ చక్రధరరావు, స్థానిక పోలీసు అధికారులతో ఈ మేరకు సమీక్షించి పలు సూచనలిచ్చారు. దేవస్థానం సెక్యూరిటీ పెంచాలని, బందోబస్తుకు అదనపు సిబ్బందిని పెంచే చర్యలు తీసుకుంటామని వివరించారు. ఆయన వెంట రావులపాలెం సీఐ సీహెచ్ విద్యాసాగర్, ఎస్సై రాము ఉన్నారు.

రూ.50.97 లక్షల ఆదాయం

దేవస్థానానికి శనివారం సాయంత్రం 4 గంటల వరకూ విశిష్ట దర్శనం ద్వారా రూ.13,05,400, ప్రత్యేక దర్శనం ద్వారా రూ.8,63,900, వేదాశీర్వచనం ద్వారా రూ.16,76,232, లడ్డు ప్రసాదం ద్వారా రూ 6,11,100, శాశ్వత అన్నదానానికి రూ.83,428, నిత్యాన్నదానానికి రూ.1,45,341, ఆన్‌లైన్ టిక్కెట్ల ద్వారా రూ.1,57,048 పాటు వివిధ రూపాల్లో రూ.50,96,624 ఆదాయం వచ్చినట్టు ఈఓ చక్రధరరావు తెలిపారు.



బాలబాలాజీని దర్శించుకుంటున్న భక్తులు

బాలబాలాజీ ఆలయంలో కోలాహలం

మామిడికుదురు: పవిత్ర వైనతేయ గోదావరి నదీ తీరం అప్పనపల్లిలో కొలువు తీరిన బాల బాలాజీ స్వామి ఆలయానికి శనివారం భక్తులు భారీగా తరలి వచ్చారు. తెల్లవారు జామున సుప్రభాత సేవ, తొలి హారతి అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామి వారి సన్నిధిలో శ్రీలక్ష్మీ నారాయణ హోమం నిర్వహించారు. స్వామి వారికి వివిధ సేవల ద్వారా రూ.2,58,570 ఆదాయం వచ్చిందని ఈఓ ఎం.సత్యనారాయణరాజు తెలిపారు. స్వామి వారి నిత్యాన్నదానం ట్రస్టుకు భక్తులు రూ.55,783 విరాళాలుగా అందించారన్నారు. నాలుగు వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారని చెప్పారు. 2,300 మంది భక్తులు స్వామి వారి అన్న ప్రసాదం స్వీకరించారన్నారు.